
సాక్షి
గుంటూరు
గురువారం । 5 । డిసెంబర్ । 2024



శబరిమలకు అయ్యప్పస్వాములు

సత్తెనపల్లి: విఘ్నేశ్వర అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు 200 మంది బుధవారం ఇరుముడి కట్టించుకొని శబరిమలకు బయలుదేరారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,902 క్యూసెక్కులు విడుదల చేశారు. స్థానిక కెనాల్స్‌కు కూడా నీటిని విడుదల చేశారు.

గజాననుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయం వద్ద గజాననుడికి బుధవారం మార్గశిర మాస చవితిని పురస్కరించుకొని అర్చకులు ఉమాపతి శాస్త్రి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

188 మంది సచివాలయ కార్యదర్శులకు నోటీసులు

నెహ్రూనగర్: వార్డు సచివాలయాల్లో వరుసగా 13 రోజులపాటు బయోమెట్రిక్ నమోదు చేయని 188 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధిగా సమయపాలన పాటిస్తూ బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందేనన్నారు. నోటీసులు అందుకున్న వారిలో ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు 13, వెల్ఫేర్ 8, ఎడ్యుకేషన్ 35, అడ్మినిస్ట్రేషన్ 26, ఎమినిటీస్ 46, శానిటేషన్ 17, రెవెన్యూ 32, హెల్త్ విభాగంలో 11 మంది ఉన్నట్లు తెలిపారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి ముఖ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్‌ఏ 2024–25) కార్యాచరణ ప్రణాళికపై గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జ్యోతిబసు మాట్లాడుతూ... ఈ తరహా శిక్షణ ద్వారా శాఖల సమన్వయం, సిబ్బంది సహకారంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. జిల్లా పంచాయతీ అధికారి బీఎన్ సాయికుమార్ మాట్లాడుతూ పథకాల సమర్థ అమలుతో గ్రామీణాభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్‌ఐఆర్డీ కన్సల్టెంట్ డాక్టర్ కె. మోహన్‌రావు మాట్లాడుతూ.. పంచాయతీలను ఉత్తమంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బాపట్ల ఈటీసీ శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ డి.వెంకట్రావు, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త ఎస్.పద్మారాణి, రీసోర్స్ పర్సన్లు పి.రామకృష్ణ, డాక్టర్ వి.వరప్రసాద్, షేక్ షఫీ, ఎస్.కొండయ్య, ఎస్.వెంకటరమణ, నోడల్ అధికారి శ్రీవాణి, కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో క్రాస్ కంట్రీ జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్–16, 18, 20 బాలబాలికలు, యువతీ యువకులు, పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి, త్వరలో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పాల్గొనే వారు ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు.

తొమ్మిది మండలాల్లో వర్ష ప్రభావం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలోని తొమ్మిది మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు స్వల్ప వర్షం పడింది. అత్యధికంగా కాకుమాను మండలంలో 6.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తెనాలి మండలంలో 0.4 మి.మీ. పడింది. మండలాలవారీగా ప్రత్తిపాడులో 4.6, చేబ్రోలు 3.8, పెదనందిపాడు 2.6, గుంటూరు తూర్పు 2.4, గుంటూరు పశ్చిమ 2.2, పొన్నూరు 2, తాడికొండ మండలంలో 1.8 మి.మీ. చొప్పున కురిసింది.

యార్డుకు 35,201 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 35,201 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,337 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది.

అన్నదాత ఆశలు ఆవరి!

కూటమి సర్కారు తీరుతో అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి. మద్దతు ధరపై మాటలకే పరిమితం కావడంతో రైతులు అయినకాడికి దళారులకు ధాన్యం విక్రయించాల్సిన దుస్థితి దాపురించింది. గత ఏడాది కన్నా ఎక్కువ ధాన్యం కొన్నామంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గొప్పగా ట్వీట్లు చేస్తున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గత సంవత్సరం గిట్టుబాటు ధర కన్నా వ్యాపారులు ఎక్కువ ధరకు తీసుకున్నారు. దీంతో ప్రభుత్వం కొనాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ ఏడాది ధర దారుణంగా పడిపోవడంతో రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయించేందుకు ఎదురు చూస్తున్నారు.

- తేమ శాతం సాకుగా నానా అవస్థలు పెడుతున్న ప్రభుత్వం
- దళారులు చెప్పిన ధరకే విక్రయించి నష్టపోతున్న రైతులు
- అన్నదాతలపై కనికరం లేకుండా వ్యవహరిస్తున్న పాలకులు

మద్దతు ధరపై మాటలకే కూటమి సర్కారు పరిమితం



వర్షాలకు తడిసిపోవడంతో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలు ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. దళారులను నమ్మవద్దు, ఎవరైనా గ్రామంలో తిరిగి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కేసులు పెడతామని ప్రకటనల్లో చెబుతోంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. నిర్ణయించిన ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సర్కారు చెప్పినా పంట రైతు చేతికి వచ్చాక చేతులెత్తేసింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పెంగల్ తుపాన్ ప్రభావంతో వర్షాలు పడ్డాయి. గుంటూరు జిల్లాలో కూడా గత వారం రోజులుగా ముసురు వాతావరణం ఉంది. చేతికి వచ్చిన పంట ఎక్కడ నీటిపాలు అవుతుందోనని రైతు సేవా కేంద్రాల చుట్టూ అన్నదాతలు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, మిల్లర్లకు ఈ ధాన్యాన్ని పంపించలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఫలానా రైతు వద్ద ధాన్యం ఉందని రైతు సేవా కేంద్రం సిబ్బందిలో కొందరు దళారులకు చెబుతున్నారు. దళారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.



బస్ షెల్టరులో ధాన్యాన్ని నిల్వ చేసుకున్న దృశ్యం

దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

పెట్టుబడి కూడా రాని దైన్యం

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,19,047 ఎకరాల్లో ధాన్యం పండించారు. మధ్యలో వర్షాలు వచ్చి పంట దెబ్బతిన్నా మళ్లీ కోలుకోవడంతో మంచి దిగుబడి వచ్చింది. 75 కేజీల చొప్పున ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. అంటే సగటున మూడు కోట్ల బస్తాల వరకూ ఉత్పత్తి వచ్చి ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది కొనుగోలు ధర సరాసరి రూ.1,800 వరకూ ఉంది. ప్రస్తుతం రూ. 1,300 కూడా రాని దుస్థితి నెలకొంది. పండించిన పంటకు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్తాకు సగటున రూ.500 తగ్గింపు

గత సంవత్సరం దళారులు బస్తా రూ.1,800 కు కొనుగోలు చేశారు. ఇప్పుడు మరీ తగ్గించేశారు. మంగళగిరి మండలంలోని రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన ఓ రైతు రూ.1,050 చొప్పున 200 బస్తాలను విక్రయించారు. చాలామంది అన్నదాతలు ధర పెరుగుతుందని ఎదురు చూస్తూ రోడ్లపై, బస్టాండ్ల వద్ద, పాఠశాల ఆవరణల్లో 10 రోజులుగా ధాన్యాన్ని రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు బస్తాకు రూ.500 వరకు తగ్గిందని రైతులు వాపోతున్నారు.

మద్దతు ధర ఊసే లేదు



ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు అంశం ఊసే లేదు. 75 కిలోల బస్తాకు రూ. 1,720 ఇస్తామని చెబుతున్నా, ఆ ధర అందుతుందన్న ఆశ లేదు. తుపాను కారణంగా పొలాల వద్ద పరదాలు కప్పి ధాన్యాన్ని ఉంచుతున్నాం. తేమ ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం ధాన్యాన్ని వెనక్కి పంపుతోంది. సర్కారు పట్టించుకోక పోవడంతో వ్యాపారులకు దాదాపు రూ.1,200కు అటూఇటుగా విక్రయించాల్సి వస్తోంది. తుపాను కారణంగా నష్టపోయే అవకాశాలు ఉండటంతో రైతులందరూ దళారులనే ఆశ్రయిస్తున్నారు. తేమతో పని లేకుండా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– అక్కి వీరాంజనేయ శివ, రైతు, నండూరు, పొన్నూరు మండలం

ఎకరాకు రూ.15 వేలు నష్టం



ఎనిమిది ఎకరాల్లో కౌలు చేశా. ఎకరాకు 20 బస్తాల ఒప్పందం. దిగుబడి ఈసారి తగ్గింది. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. మిషనుతో నూర్పిడికి రూ.3 వేలు అడుగుతున్నారు. బయట ధరలేమో బస్తా రూ.1,400లోపే పలుకుతోంది. దిగుబడి తగ్గి, పెట్టుబడి ఖర్చులు లెక్కేసుకుంటే ఎకరాకు రూ.15 వేలకుపైగా నష్టం కనిపిస్తోంది. వర్షాలతో పంట కాపాడుకోవటమే కష్టంగా మారింది. ప్రభుత్వం తీరుతో తేమశాతం, తరుగు పోను ఇంచుమించు మార్కెట్ ధరే గిడుతోంది.

– నక్కా బుల్లబ్బాయి, కౌలు రైతు, కొల్లిపర

జిల్లాలో పలు చోట్ల భూ ప్రకంపనలు

ఆందోళనతో పరుగులు తీసిన ప్రజలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం ఉదయం సంభవించిన భూ ప్రకంపనల ప్రభావంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. తెలంగాణలోని వరంగల్ జిల్లా ములుగు కేంద్రంగా సంభవించిన భూకంపం ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లాలోనూ కనిపించింది. గుంటూరు నగరంతోపాటు వివిధ మండలాల్లో ఉదయం 7.30 సమయంలో దాదాపు 10 సెకన్లపాటు భూమి కంపించింది. ములుగు ప్రాంతంలో భూ ప్రకంపనల ప్రభావం రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు కావడంతో దాని ప్రభావం గుంటూరును తాకింది. ప్రధానంగా అపార్ట్‌మెంట్లు, పై అంతస్తుల్లో నివసించే ప్రజలకే దీని ప్రభావం తెలిసింది. ఇళ్లలో మంచాలు, కుర్చీలు కదలడాన్ని వారు స్పష్టంగా గమనించారు. గుంటూరులోని కాకుమానువారి తోటలో ఉదయం 7.30 సమయంలో భూ ప్రకంపనలకు ముందుగా రోడ్లపై ఆవులు అదేపనిగా అరుస్తూ, పరుగులు తీశాయని స్థానికులు చెబుతున్నారు. ఎక్కడా ప్రజలకు ఎటువంటి నష్టం జరగలేదు.

గుంటూరులో తొలిసారి...



షేక్ జాన్ సాహెబ్

భూ ప్రకంపనలపై గుంటూరులోని హిందూ కళాశాల భూ విజ్ఞాన శాస్త్ర విభాగాధిపతి షేక్ జాన్ సాహెబ్ 'సాక్షి'తో మాట్లాడుతూ... సేఫ్ జోన్‌లో ఉన్న గుంటూరులో తొలిసారిగా భూ ప్రకంపనలు వచ్చాయని, ఇందుకు అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. అధిక మైనింగ్‌తోపాటు బోర్ల కోసం 1,200 అడుగుల నుంచి 1,500 అడుగుల వరకు తవ్వడం సైతం కారణం కావచ్చునని వివరించారు. చెరువులు, కాలువల్లోకి చొచ్చుకుని వెళ్లి అనధికార నిర్మాణాలు చేపట్టడం, భారీ వృక్షాలను నరికివేసి భూమి పొరల్లోకి చొచ్చుకుని వెళ్లిన వేర్లను పెకిలించడం వల్ల కూడా ఇలాంటి పరిణామాలు సంభవించే అవకాశముందని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్‌టీఎఫ్ పాత్ర కీలకం



విశ్రాంతి గదిని ప్రారంభిస్తున్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, చిత్రంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

నగరంపాలెం: శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. నగరంపాలెం పీఎస్ పక్కనున్న ఎస్‌టీఎఫ్ కార్యాలయంపై సిబ్బంది విశ్రాంతి గదిని బుధవారం రేంజ్ ఐజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు ముగిశాక వారి విశ్రాంతి కోసం నూతన గదిని అందుబాటులోకి తేవడం అభినందనీయమని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌టీఎఫ్ సిబ్బందికి వసతుల కల్పన తమ బాధ్యత అని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్‌ఐ (పరిపాలన) ఉదయ్‌భాస్కర్, సంక్షేమ ఆర్‌ఐ శివరామకృష్ణలను అభినందించారు. విశ్రాంతి తీసుకునేందుకు అధునాతన పరుపులతో మంచాలు, టీవీ, పుస్తకాలు, ప్రథమ చికిత్స కిట్లు, సామాన్లు భద్రపరుచుకునేందుకు వ్యక్తిగత లాకర్లు, బీరువాలు అందుబాటులో ఉంచారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, డీఎస్పీలు బి.సీతారామయ్య (ఎస్‌బీ), రమేష్ (ట్రాఫిక్), నగరంపాలెం పీఎస్ సీఐ వీరనాయక్, ఆర్‌ఐలు శ్రీహరి రెడ్డి, ఉదయభాస్కర్, శివరామకృష్ణ, ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పల్నాటి వీరారాధన ఉత్సవాలు



లంకన్నకు ప్రాణప్రతిష్ట చేసిన ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న వీరాచార వంతులు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన వీరుల ఆయుధాల గ్రామోత్సవం బుధవారం తెల్లవారుజాము వరకు సాగింది. ప్రజలు పల్నాటి వీరుల ఆయుధాలకు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. అనంతరం వీరాచారులు నాగులేరు గంగధారి మడుగులో ఆయుధాలను శుభ్రం చేసుకున్నారు. చెన్నకేశవస్వామి గుడి వద్ద పీఠాధిపతి ఇచ్చిన శంఖుతీర్థాన్ని స్వీకరించారు. అంకాలమ్మ తల్లి గుడిలోనూ తీర్థం తీసుకున్నారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవతో కలిసి వీధుల్లో పరుగులు తీస్తూ నాయకురాలు నాగమ్మ వేషంలో ఉన్న ఆచారవంతుని తరుముకుంటూ వీరుల గుడి ఆవరణలో ఉన్న లంకన్న ఒరుగు ఘటనాస్థలానికి చేరుకున్నారు.లంకన్నకు బ్రహ్మనాయుడు ప్రాణప్రతిష్ట చేసిన ఘట్టాన్ని నాటకీయంగా ప్రదర్శించారు. తర్వాత కళ్లిపోతురాజు మండపం వద్ద ఏర్పాటు చేసిన కళ్లిమండెపై వీరుల ఆయుధాలు కళ్లికి ఒరగడంతో ఉత్సవం ముగిసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. కళ్లి మండెలోని ఆకుల మండలను పోటీపడి తీసుకుని వీరాచారులు తమ నివాస స్థలాలకు తిరుగు పయన మయ్యారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సవాలలో పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేత

సంతమాగులూరు (అద్దంకి): హత్య కేసును కొట్టివేస్తూ సెవెన్త్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సంతమాగులూరుకు చెందిన గడ్డం వెంకటరెడ్డి 2016లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేశారు. ఈ మేరకు ఒంగోలులోని సెవెన్త్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి కేసును కొట్టివేస్తూ బుధవారం తీర్పును వెలువరించారు. సంచలనం రేపిన హత్య కేసులో నిందితులుగా ఉన్న అట్లా చిన వెంకటరెడ్డి, అట్లా పెద వెంకరెడ్డి, అట్లా చిన శ్రీనివాసరెడ్డి, టి. ప్రభాకర్‌రెడ్డి, కొండారెడ్డి సత్యనారాయణరెడ్డి, దేవసాని వీరారెడ్డి నిర్దోషులని కోర్టు తీర్పు చెప్పింది. వీరిలో వీరారెడ్డి గతంలోనే మృతి చెందాడు.

ప్రకృతి హితైషి.. ప్రతిక్షణమదే కృషి!

- సహజ వనరుల సమర్థ వినియోగానికి విశేష కృషి
- తెనాలి వాసి డాక్టర్ పొదిలి రాజశేఖర రాజు ప్రత్యేకత
- 'ట్రాన్స్‌వర్సాలిటీ గ్లోబల్ అవార్డు–2024'కు ఎంపిక

ఆయనకు ప్రకృతి అంటే ఎంతో మమకారం... నీటి వనరుల సంరక్షణలో ఎనలేని కృషి చేసిన 'జల' బంధువు ఆయన. మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడే కార్యకలాపాల్లో నిత్యం నిమగ్నమైన ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. పురస్కారాలు అందుకుంటూ ఉత్సాహంగా ముందుకు సాగుతున్న ఆయనే తెనాలికి చెందిన డాక్టర్ పొదిలి రాజశేఖర రాజు.

తెనాలి: జీవితంలో నీరు, విద్యుత్, పర్యావరణాలదే కీలకపాత్ర. ఆరోగ్య, ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవనోపాధిపై వీటి ప్రభావం ఎంతగానో ఉంటుంది. సహజ వనరులను విచక్షణరహితంగా వినియోగించడం విపత్తులకు దారి తీస్తోంది. వీటిపై అవగాహన కల్పించటమే కాదు... వర్షాధార ప్రాంతాల్లో నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతల ఏర్పాటుకు తోడ్పాటునిస్తూ సహజ వనరుల పరిరక్షణకు డాక్టర్ పొదిలి రాజశేఖర రాజు కృషి చేస్తున్నారు. పలు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఇండియా వాటర్ ఫౌండేషన్ ఈ నెల 5, 6వ తేదీల్లో ఢిల్లీలో 'నీరు–శక్తి–పర్యావరణం'పై ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ సదస్సులో 'ట్రాన్స్‌వర్సాలిటీ గ్లోబల్ అవార్డు–2024' అందుకోనున్నారు. తెనాలికి చెందిన డాక్టర్ రాజశేఖర రాజు నుంచి ఇతరులు స్ఫూర్తి పొందేలా సాగిన ఆయన జీవితంలో విశేషాలు ఎన్నో!

సేవకు అడుగు పడిందిలా...

రాజశేఖర రాజు ప్రకాశం జిల్లాకు చెందిన వారైనా గుంటూరు జిల్లా తెనాలిలో స్థిరపడ్డారు. సామాజిక శాస్త్రంలో డిగ్రీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ చేశారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో వృక్షశాస్త్రంలో పీజీ చదివారు. 2008లో అహ్మదాబాద్‌లోని 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఈడీఐఐ)లో 'మేనేజ్‌మెంట్ ఆఫ్ ఎన్‌జీవోస్'లో పీజీ డిప్లొమా చేశారు. అక్కడి నుంచి సమాజసేవలో అడుగుపెట్టారు. తొలుత 'నాబార్డు' ప్రాజెక్టులో టీం లీడర్‌గా పని చేశారు. పల్లెల్లోని వివిధ బృందాలకు సేవలు అందించారు. తర్వాత అంబుజా సిమెంట్ ఫౌండేషన్, దాల్మియా సిమెంట్ వంటి సంస్థలలో పర్యావరణ పరిరక్షణ, నీటి నిర్వహణ, సామాజిక అభివృద్ధి,



బళ్లారిలో చెక్‌డ్యామ్ నిర్మాణంలో రాజశేఖర రాజు

గ్రామాభివృద్ధి రంగాల్లో కీలకమైన బాధ్యతలను చేపట్టారు. జువారి సిమెంట్ లిమిటెడ్‌లో మేనేజర్ – అడ్మినిస్ట్రేషన్ (సీఎస్‌ఆర్, సీఏ, సస్టైనబిలిటీ)గానూ విధులు నిర్వర్తించారు.

రెండు లక్షల కుటుంబాలకు లబ్ధి

ప్రస్తుతం కర్ణాటకలోని బళ్లారిలో జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్‌లో సీనియర్ మేనేజరుగా పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, సమర్థ వినియోగం అంశాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధి, వర్షపు నీటి సంరక్షణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో పని చేశారు. ఆయన నేతృత్వంలో దాదాపు 600 గ్రామాల్లో 50 లక్షల క్యూబిక్ మీటర్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యం అభివృద్ధి జరిగిందని చెబుతారు. ఫలితంగా మూడు రాష్ట్రాల్లోని రెండు లక్షల కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి కలిగింది.

స్వీయ జీవిత పయనమే ప్రేరణ

సామాజిక సేవకు ప్రేరణ తన జీవితమే అని రాజశేఖరరాజు చెప్పారు. వ్యవసాయాధార కుటుంబంలో జన్మించినట్లు పేర్కొన్నారు. పండిన పంటలతో వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలను పూర్తిగా తీర్చలేకపోయిందని గుర్తుచేశారు. దీంతో చిన్నప్పట్నుంచే ఆర్థిక అవస్థలు, సామాజిక అసమానతలను ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తనను చదివించేందుకు తల్లిదండ్రులు ఎంతగానో కష్టపడినట్టు గుర్తు చేసుకున్నారు. తనలాంటి ఎన్నో కుటుంబాలకు తోడ్పాటు అందించాలనే భావనతో సామాజిక సేవ ఎంచుకున్నానని తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో ఈ మేరకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఫలితంగానే ఇన్ని విజయాలను సాధించినట్లు తెలిపారు.

వరించిన పురస్కారాలు



ఇండియా సీఎస్సార్ అవార్డును స్వీకరిస్తూ...

ఈ క్రమంలో ఆయనకు పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. వాటర్ హీరో అవార్డు (2020), నేషనల్ గ్రీన్టెక్ గోల్డెన్ అవార్డు (2014), ఈటీ గ్లోబల్ సీఎస్సార్ లీడర్‌షిప్ అవార్డు (2018), రోటరీ కర్ణాటక సీఎస్సార్ అవార్డు (2020), కరోనా సమయంలో సీఎస్సార్ టైమ్స్ 'కొవిడ్ వారియర్ అవార్డు(2020), 2022లో ఉత్తమ సామాజిక బాధ్యత అధికారి అవార్డు, రెస్పాన్సిబుల్ లీడర్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే అంతర్జాతీయ సమావేశంలో రెండో రోజైన ఈనెల 6వ తేదీన వాటర్ ట్రాన్స్‌వర్సాలిటీ గ్లోబల్ అవార్డు–2024ను స్వీకరించనున్నారు.

క్షణికావేశంలో తండ్రిని చంపిన కుమార్తెలు



రెడ్యానాయక్ మృతదేహం

యడ్లపాడు: అనారోగ్యంతో ఉన్న తల్లిని పట్టించుకోవడం లేదని తండ్రిని నిలదీసిన కుమార్తెలు క్షణికావేశంలో అతని ప్రాణాలు తీశారు. ఈ విషాద ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బోయపాలెం సుగాలీ కాలనీకి చెందిన భుక్యా రెడ్యానాయక్ (55) భార్య సుక్రీభాయి ఇటీవల అనారోగ్యం వల్ల చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది మంగళవారం డిశ్చార్జి అయి ఇంటికి వచ్చింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో దానిని పగులగొట్టి కుమార్తెలిద్దరూ తల్లిని లోపలికి తీసుకువెళ్లారు. కొద్ది సమయం తర్వాత మద్యం సేవించి వచ్చిన తండ్రిని తల్లికి అనారోగ్యంగా ఉన్నా.. పట్టదా అంటూ నిలదీశారు. దీంతో తండ్రి, కుమార్తెల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. క్షణికావేశంలో కుమార్తెలు కర్రలతో తండ్రి తలపై మోదారు. దీంతో రెడ్యానాయక్ కుప్ప కూలి కూలిపోయాడు. కొద్ది సేపటి తర్వాత చూడగా తండ్రి చనిపోయాడని తెలుసుకున్న కుమార్తెలు కేసు అవుతుందని ఎవరికీ చెప్ప లేదు. బుధవారం ఉదయం విషయం తండ్రి తరఫు బంధువులకు తెలియడంతో ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు, చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్‌ఐ వి.బాలకృష్ణ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.



వివరాలు తెలుసుకుంటున్న నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ సుబ్బానాయుడు

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,800** గరిష్టం : రూ. **3,600**

మోడల్ ధర రూ. **3,300**

క్లుప్తంగా

విపత్తు సమయంలో అప్రమత్తత ముఖ్యం

గుంటూరు వెస్ట్: విపత్తు సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బుధవారం విజయవాడ నుంచి అధికారులతో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వరదల సమయంలో సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించాలన్నారు. తగిన సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 67 రెయిన్ గేజ్‌లలో పనిచేయని 29 గేజ్‌లను రిపేరు చేయించాలన్నారు. సమావేశంలో జిల్లా విపత్తులు నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై మానసిక దాడి ఆపాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులపై ప్రభుత్వం చేస్తున్న మానసిక దాడి ఆపాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఈ మేరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంఈవోలకు వినతి పత్రాలను సమర్పించినట్లు వారు తెలిపారు. ఏదో ఒక సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని రోజూ ఒత్తిడికి గురి చేయడంతోపాటు ఒక పని పూర్తి కాకముందే మరొకటి అప్పగిస్తున్నారని వాపోయారు. ఇతర విషయాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యాబోధన గురించి అసలు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం తీరు మార్చుకోవాలని పేర్కొన్నారు. బోధనేతర బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరిన్ని పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

గంజాయిపై డ్రోన్ నిఘా



పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి కేటాయించిన డ్రోన్లలో ఒకటి



డ్రోన్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాన్ని తీసిన చిత్రం

నరసరావుపేట: గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టనున్నారు. దీనిలోభాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి మూడు డ్రోన్లు కేటాయించారు. బుధవారం పట్టణంలోని చిత్రాలయ సెంటర్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, బస్టాండ్ ఎదురుగా ఉన్న హర్షు కాలేజీ, బీసీ కాలనీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రతి పోలీసు స్టేషను పరిధిలో గంజాయి వినియోగం, విక్రయం జరిగేందుకు అవకాశం ఉన్న శివారు జనావాసంలేని ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలపై డ్రోన్లతో నిఘా పెట్టనున్నారు.

అంతర్రాష్ట్ర వాహన చోరుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీలు జయరామ్‌ప్రసాద్, ఎ.శివాజీలు

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు చేసినట్లు వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీలు తెలిపారు. గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు కేసు వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి సుమారు రూ. 8 లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారి కథనం ప్రకారం... పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణం, పురుషోత్తంపట్నానికి చెందిన వల్లెపు సత్యదాసు చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నాడు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పలు చోరీలు చేశాడు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ (క్రైం) కె.సుప్రజ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. సుమారు 150 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేశామని, వాహనాలను నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో వీఐపీ రోడ్డు చివర విక్రయిస్తున్నాడనే సమాచారంతో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన గుంటూరు జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, వెస్ట్ డీఎస్పీ బి.ఎం. జయరామ్‌ప్రసాద్, నగరంపాలెం పీఎస్ సీఐ వీరానాయక్, సీసీఎస్ సీఐ ఎం.వి.సుబ్బారావు, నగరంపాలెం ఎస్సై షేక్ సలాం, సీసీఎస్ ఎస్సై ఎల్.రాములు, ఏఎస్సై కృష్ణస్వామి, హెచ్‌సీ విజయ్‌కుమార్, పీసీలు శ్రీక్రాంత్, షేక్ నజీర్, నగరంపాలెం సిబ్బంది పీసీలు ప్రేమకుమార్, క్రాంతి, వసంతరావు నాయక్‌లను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందనలు తెలిపారని చెప్పారు.

మార్కెట్‌లోకి న్యూ అమేజ్ త్రీజెన్ కారు



కారు విడుదల చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక ఆటోనగర్‌లోని ఎక్స్‌ప్రెస్ హోండా షోరూంలో న్యూ అమేజ్ త్రీ జెన్ కారును బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఎక్స్‌ప్రెస్ హోండా గ్రూప్ ఎండీ రాజేష్, సీఈఓ దిలీప్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్కెట్, ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త కారును రూపొందించారని అన్నారు. సేఫ్టీ, ఇతర ఫీచర్స్‌తో వచ్చిందన్నారు. ఈ కారు వీ, వీఎక్స్, జెడ్ఎక్స్ వేరియంట్స్‌లో లభిస్తుందని తెలిపారు. ధరలు రూ.7,99,900 నుంచి రూ.9,19,900, సీవీటీ రూ.9.69 లక్షల నుంచి రూ.10,89,900 వరకు మార్కెట్‌లో లభిస్తాయని చెప్పారు. బుకింగ్స్ ఓపెన్ చేసినట్లు వెల్లడించారు.

8న జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపిక

తెనాలి: జిల్లా నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన ఉదయం 8 గంటలకు ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ జట్లను ఎంపిక చేయనున్నారు. సంఘం కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తిగలవారు వయసు ధ్రువీకరణపత్రంతోపాటు ఆధార్, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని కోరారు. వివరాలకు డి.నాగరాజు, జె.సుధాకర్‌లను 99633 34731, 91771 67740 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

7న జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 7న జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న జిల్లా స్థాయి పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డీఎల్ఐటీఐ)లో జాబ్‌మేళా నిర్వహించనున్నాయి. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఆర్‌పీవీ మణిదీప్‌ను 80746 07278 ఫోను నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

భక్తులకు వైద్య సేవలు అందించడం మహాభాగ్యం

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి



బాధితుడికి పిండి కట్టు వేస్తున్న నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: శబరిమల వచ్చే అయ్యప్ప భక్తులకు వైద్య సేవలు అందించడం మహాభాగ్యంగా భావిస్తున్నామని ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, గుంటూరు సాయిభాస్కర్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈనెల ఒకటి నుంచి శబరిమల పంబ వద్ద నాలుగు రోజులు పాటు బూసిరెడ్డి నేతత్వంలోని వైద్య బృందం భక్తులకు వైద్య సేవలు అందించింది. దేవస్థానం బోర్డు వైద్యుల ఆహ్వానం మేరకు ఆరుగురు వైద్యులతో కూడిన బృందం పంబ వద్ద ఉన్న దేవస్థానానికి చెందిన వైద్యశాలలో అక్కడకు వచ్చే భక్తులకు ఉచితంగా సేవలు అందించారు. ఈ మేరకు బుధవారం డాక్టర్ నరేంద్రరెడ్డి ఓ ప్రకటన ద్వారా అక్కడి విశేషాలను వివరించారు. జారిపడి ఫ్యాక్చర్లకు గురైన వారికి ప్రాథమిక చికిత్సలో భాగంగా పిండి కట్లు వేసి కొట్టాయం జిల్లా ఆస్పత్రికి తరలించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఉచితంగా వైద్య సేవలు అందించడం భగవంతుడు కల్పించిన అవకాశంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం అధికారులు కూడా తమకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యులు జనవరి 17వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందజేస్తారని డాక్టర్ నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు.

రైలు పట్టాలపై రెండు చోట్ల ఇద్దరు మృతి



కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం




మంగళగిరి రైల్వే పోలీసులు గుర్తించిన మరో మృతదేహం

తాడేపల్లి రూరల్: గుంటూరు ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ప్రాంతాల్లో ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. సి.ఐ. అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలో ట్రాక్ పక్కన వ్యక్తి మృతి చెంది ఉండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్లి పోలీసులు పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఎరుపు చొక్కా, నలుపు ప్యాంటు, జర్కిన్, కట్ వైట్ బనియన్ ఉన్నాయి. మంగళగిరి రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాక్‌పై కూడా మరో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లారు. మృతుడి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉండవచ్చని, ఒంటిపై నీలి రంగు జీన్స్ ప్యాంటు, నల్ల టీషర్టు, దానిపై చారల చొక్కాలున్నాయి. ఎవరైనా వీరిని గుర్తిస్తే 94406 27546, ఎస్ఐ రమేష్ 99083 83300 నెంబర్లలో సంప్రదించాలని సీఐ తెలిపారు.

నిజాయతీ చాటుకున్న సైకిల్ మెకానిక్

ఫోన్‌పేలో పొరపాటున పడిన రూ.లక్ష యజమానికి బదిలీ



ఫోన్‌పేలో చెల్లించిన దృశ్యం



రమణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.లక్ష పొరపాటున జమ అయ్యింది. బ్యాంకు ద్వారా వివరాలు తెలుసుకున్న ఆయన తిరిగి బుధవారం సదరు యజమానికి ఫోన్‌పేలో పంపి తన నిజాయతీ చాటుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం... ఉండవల్లి సెంటర్‌లో సైకిల్ మెకానిక్‌గా జీవనం సాగించే రమణ మంగళవారం బ్యాంకులో నగదు డ్రా చేయడానికి వెళ్లగా రూ.లక్ష అదనంగా కనిపిస్తున్నాయి. బ్యాంకు అధికారులను సంప్రదించగా ఒడిశా రాష్ట్రం మల్గరి గ్రామానికి చెందిన పంకజ్ మజ్హాహి ఖాతా నుంచి ఈ మొత్తం వచ్చినట్లు తెలిసింది. బ్యాంకులోనే పంకజ్ ఫోన్ నెంబర్ తెలుసుకుని ఫోన్ పే ద్వారా పంపించారు. పంకజ్ వచ్చీరాని ఆంగ్లంలో మాట్లాడుతూ.. ఈ నగదును తన పిల్లల చదువుల కోసం వేరే వారికి పంపించబోయి రమణకు పంపినట్లు చెప్పారు. తిరిగి పంపినందుకు ధన్యవాదాలు తెలిపారు. రమణ ఫోన్‌పేకు రూ.మూడు వేలు బహుమతిగా నగదు బదిలీ చేశారు.

తల్లిని పోషించని కుమారుడిపై బైండోవర్ కేసు



విచారణ చేస్తున్న తహసీల్దార్, అధికారులు

జే.పంగులూరు: తల్లి పేరుతో ఉన్న భూమిని తీసుకొని ఆమెను పోషించని కుమారుడిపై బైండోవర్ కేసు నమోదు చేసి, ఆ భూమిని అధికారులు తిరిగి అప్పగించిన సంఘటన బుధవారం బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని కొండమూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోటపాడుకు చెందిన బత్తుల రామకోటి, శేషమ్మ దంపతులకు కుమారుడు శ్రీను ఉన్నాడు. రామకోటి కొద్దిరోజుల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. కొండమూరు గ్రామం సర్వే నంబర్ 2-1 లో 31 సెంట్ల భూమిని శ్రీను దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని, తన పోషణ చూడటం లేదని తల్లి బత్తుల శేషమ్మ గత నెల 11వ తేదీ బాపట్లలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది. దీనిపై బుధవారం పంగులూరు మండల తహసీల్దార్ సింగారావు, ఎంపీడీఓ కె.స్వరూప రాణి, రేణింగవరం ఎస్ఐ వినోద్‌బాబు కొండమూరు వెళ్లి విచారణ చేశారు. బత్తుల శ్రీను తన తల్లికి చెందిన 31 సెంట్ల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని నిర్ధారించి, ఎంసీ 47 ద్వారా అతనిపై బైండోవర్ చేయించారు. భూమిని అర్జీదారు బత్తుల శేషమ్మకు అప్పగించినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు.

బస్సులో బ్యాగ్ మరచిపోయిన మహిళ

- బెంగళూరు నుంచి పుట్టింటికి వస్తుండగా ఘటన
- బ్యాగ్‌లో ఎనిమిది సంవర్ల బంగారం, పాస్‌పోర్టు
- దొరికిన వారు అందజేయాలని వినతి

జె.పంగులూరు: బెంగళూరు నుంచి పుట్టింటికి వస్తూ విలువైన వస్తువులతో పాటు, పాస్‌పోర్టు కలిగిన బ్యాగును అర్ధరాత్రి బస్సులో ఓ మహిళ పోగొట్టుకుంది. వివరాల్లోకి వెళితే.. శిరిష పుట్టినిల్లు అయిన కొండమంజులూరుకు వచ్చేందుకు మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు బెంగళూరు నుంచి వైజాగ్ వెళ్లే రాజేష్ ట్రావెల్స్ (కెఏ 03 ఏఏం 7125) బస్సులో తన ఇద్దరి పిల్లలతో బయలుదేరింది. భర్త గోరంట్ల రామకృష్ణ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, ఆమె ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ బెంగళూరులో నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి 2.45 గంటల సమయంలో కొండమంజులూరు సమీపంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద నిద్రమత్తులోనే ఇద్దరి పిల్లలతో బస్సు దిగింది. అయితే, ఆమె సీటు పక్కనే పెట్టుకున్న విలువైన బ్యాగును మర్చిపోయింది. తనను తీసుకు వెళ్లేందుకు కారులో సిద్ధంగా ఉన్న తమ్ముడుతో కలిసి ఇంటికి వచ్చింది. ఆ రాత్రి నిద్రపోయింది. తెల్లారి లేచి తన సామగ్రి చూసుకోగా బ్యాగ్ మిస్ అయిందని గుర్తించి నిర్ఘాంత పోయింది. వెంటనే బస్సు డ్రైవర్‌కి ఫోన్ చేయగా మధ్యలో ఎంతో మంది దిగిపోయారని తామేమీ చేయలేమని తెలిపారు. లండన్ వెళ్లేందుకు ఈ మధ్యే పాస్‌పోర్టు వచ్చినట్లు తెలిపింది. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వనున్నట్లు బాధితురాలు తెలియజేసింది. బ్యాగ్ దొరికిన వారు 7661004251 నంబర్‌కి ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని విన్నవించింది.

ప్రభుత్వ ఆస్పత్రుల ఆకస్మిక తనిఖీ



ప్రభుత్వ వైద్యశాలలోని మందుల గదిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డైరక్టర్ అనిల్‌కుమార్

నరసరావుపేట: గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి తెలుసుకునేందుకు మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) అదనపు డైరక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ బుధవారం నరసరావుపేట, చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రులలో అందిస్తున్న సేవలను నేరుగా రోగులను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. మందుల గదులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్‌సీహెచ్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న సేవలను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని హెచ్‌ఎంఐఎస్ స్టేట్‌మోడల్ ఆఫీసర్ శివశంకర్‌బాబు ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. తనిఖీలో స్టేట్ ఇమ్యూనైజేషన్ మోడల్ ఆఫీసర్ డాక్టర్ దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ గీతాంజలి, నీలకంఠేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీనియర్స్ విజేత రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత

ముగిసిన ఎడ్ల పోటీలు




ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, ప్రజా ప్రతినిధులు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఎండ్ల బండ లాగుడు పోటీలు బుధవారం ముగిశాయి. బుధవారం సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. మాచర్ల ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మనందరెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు అశోక్‌రెడ్డి, నరేంద్రవర్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఎడ్లపోటీలను తిలకించారు. సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా సిరివేళ్ల మండలం గంపుంమాందిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 2,665 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత 2,651 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష్ చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత తృతీయ స్థానంలో, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత నాలుగో స్థానంలో, నంద్యాల జిల్లా సివేళ్ల మండలం గంపుమాందిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి మరో ఎడ్లజత ఐదవ స్థానంలో, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం త్రిషజ్ఞరెడ్డి, జశ్వితారెడ్డి ఎడ్ల జత ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను దాతలు సంగినేడి బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ పంగులూరి పుల్లయ్య, కొండపల్లి అమరలింగేశ్వరరావు, గోరంట్ల నాగేశ్వరరావు, గోరంట్ల శివశంకర్, తండా మస్తాన్‌జాని, ఎస్వీఆర్ కృష్ణ, ఎస్‌వి సుబ్రమణ్యం, కల్లుట్ల రమేష్; మాడిశెట్టి నరసింహారావు, ట్రాక్టర్ జాని అందించారు.

చనిపోయినట్టు చూపి పింఛన్ తొలగింపు

- కుమారుడి ఖాతాలో బీమా సొమ్ము జమ
- వినుకొండలో ఉద్యోగుల నిర్వాకం



లబ్ధిదారు చనిపోయినట్లుగా చూపిస్తున్న కంప్యూటర్



బాధితురాలు వల్లెపు సీతమ్మ

వినుకొండ(నూజెండ్ల): బతికి ఉన్న పింఛన్ లబ్ధిదారును చనిపోయినట్టు నమోదు చేసిన ఉద్యోగులు బీమా సొమ్మును ఆమె కుమారుడి ఖాతాలో జమ చేశారు. ఈ ఘటన వినుకొండ పట్టణంలో వెలుగుచూసింది. బాధితురాలి కథనం ప్రకారం.. వినుకొండ పట్టణం సీతయ్యనగర్‌కు చెందిన వల్లెపు సీతమ్మ వితంతు పింఛన్ తీసుకుంటుంది. నవంబరు నెలలో ఆమెకు పింఛన్ రాలేదు. సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్లగా.. ఆన్‌లైన్‌లో చనిపోయినట్టు నమోదైందని, అందుకే పింఛన్ ఆగిపోయిందని సమాధానం ఇచ్చారు. తాను బతికే ఉన్నానని పింఛన్ పునరుద్ధరించాలని కోరినా పట్టించుకోలేదు. దీంతో బాధితురాలు మున్సిపల్ కమిషనర్ వద్దకు వెళ్లి తన గోడు వెల్లబోసుకుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరా తీస్తే బాధితురాలు ప్రమాదంలో చనిపోయినట్టు నమోదు చేసి ఆమె కుమారుడు శ్రీకాంత్ ఖాతాలో రూ.90 వేలు బీమా నగదును జమ చేసినట్లు ఉద్యోగులు గుర్తించి అవాక్కయ్యారు. బీమా సొమ్ము తిరిగివ్వాలని బాధితురాలిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో బాధితులు పింఛన్ మంజూరు చేసిన తర్వాత ఏ ఖాతా నుంచి బీమా సొమ్ము జమైందో ఆ ఖాతాకే చెల్లిస్తామని సమాధానమిచ్చారు. దీంతో ఉద్యోగులు జరిగిన తప్పును పరిష్కరించేందుకు తంటాలు పడుతున్నారు.

డ్రైవర్ అనుచిత ప్రవర్తనపై కేసు

మార్టూరు: సుమారు పది నెలల క్రితం మార్టూరులో జరిగిన ఓ సంఘటనపై బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఎస్ఐ షేక్ సైదా వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు అనంత గ్రానైట్ ఫ్యాక్టరీ ఉంది. ఇందులో తనిఖీల నిమిత్తం ఈ సంవత్సరం జనవరి 30వ తేదీ మైనింగ్ అధికారులు బాలాజీ నాయక్, ప్రతాపరెడ్డిల బృందం వచ్చింది. ఈ సందర్భంగా మైనింగ్ అధికారి ప్రతాపరెడ్డి కారు డ్రైవర్‌గా చెప్పే కె. శ్రీనివాసరావుకి, ఫ్యాక్టరీ యజమాని కామినేని జనార్దన్, ఇతర గ్రానైట్ అసోసియేషన్ సభ్యులతో వాగ్వాదం జరిగింది. విషయం తెలిసి పర్చూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఘటనాస్థలికి చేరుకొని ఏం జరిగిందంటూ అధికారులతో మాట్లాడారు. ఏలూరిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ శ్రీనివాసరావు దుర్భాషలాడాడు. ఏడీ ప్రతాపరెడ్డి కారు డిక్కీని తెరిచి చూడగా అందులో కారపు పొట్లాలు, కర్రలు ఉన్నాయి. అంతేకాక అధికారుల అండ చూసుకొని శ్రీనివాసరావు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని డబ్బులు డిమాండ్ చేశాడనేది కూడా మరొక ఆరోపణ.ఈ క్రమంలో బుధవారం ఫ్యాక్టరీ మేనేజర్ మామిడాల వేణుగోపాల్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

మూల్యాంకనంలో పొరపాట్లకు తావివ్వరాదు



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా డిగ్రీ మూల్యాంకనం నిర్వహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూజీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.కృష్ణారావు తెలిపారు. వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వర్సిటీ డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం డాక్టర్ కృష్ణారావు సందర్శించారు. కళాశాలలోని మూల్యాంకన కేంద్రం స్ట్రాంగ్ రూమ్, జవాబు పత్రాల పంపిణీ గది, అధ్యాపకులకు కల్పించిన వసతులు స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూల్యాంకనంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని చెప్పారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం కొనసాగాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.